అనుమానమా! నీకో నమస్కారం!!

"రేవతీ!"

"ఊఁ"

"దగ్గరగా రా.... కూర్చో, ఊహుఁ అక్కడ కాదు ఇక్కడ...." చిలిపిగా చూశాడు మహేంద్ర.

రేవతికి కొత్తగా, భయంగా ఉంది, బెరుకుగాను ఉంది. చిన్నపిల్ల కాకపోయినా ఏమిటో జరగబోయే అనుభవాన్ని తల్చుకుంటే గుండెల్లో ఏదో దడ.

ఒక్కసారి మహేంద్ర ఆమెను దగ్గరకు తీసుకుని ఊపిరాడనంతగా కౌగిలించుకున్నాడు. రేవతి వదలించుకునే ప్రయత్నంలో "ఏమిటండీ" అంది.

కౌగిలి సడలించి ఆమె మొహంలోకి చూస్తూ-

"కాలేజీల్లో నీకు బాయ్‌ఫ్రెండ్స్ ఉన్నారా?" అన్నాడు.

ఉలిక్కిపడింది రేవతి. పెళ్ళై వారం రోజులయింది.

శోభనం రోజు రాత్రి ఒక భర్త భార్యను అడగవలసిన ప్రశ్న ఇదా! ఇది సమయమా? ఇది సందర్భమా?

"ఏమిటిట్లా చూస్తావు?- ఎవరు గుర్తువచ్చారు?" అతను నవ్వుతూనే అడుగుతున్నా, రేవతికి కంపరంగా అనిపించింది.

"ఎవరూ గుర్తురాలేదు. తొలిరేయి గురించి ఎన్నో కథలు చదివాను, సినిమాల్లో చూశాను. కానీ మీలాగా ఏ భర్తా భార్యను ప్రశ్నించడం చదవలేదు, చూడలేదు, వినలేదు." అంది కాస్త నిష్ఠూరంగా.

"ఓ, చాలా చమత్కారంగా మాట్లాడుతున్నావే. బి.ఏ. చదివింది కో ఎడ్యుకేషన్ కాలేజీలో కదా- ఈ కాలంలో ఆడపిల్లల పాతివ్రత్యం గురించి నాకు బాగా తెలుసులే...."

వ్యంగ్యంగా అంటున్న అతని మాటల ధోరణికి దెబ్బతిన్నట్లు చూసింది రేవతి. ఆమె మనసు చిన్నబోయింది.

మహేంద్ర ఏమనుకున్నాడో బిగ్గరగా నవ్వి- "ఏమిటట్లా దూరంగా పోతున్నావు. ఇది దగ్గరగా రావలసిన సమయం...." ఆమెను దగ్గరగా లాక్కున్నాడు.

అతని స్పర్శలో ఏదో లోకంలో తేలిపోబోతున్న రేవతి మళ్ళా ఉలిక్కిపడింది, అతని మరో ప్రశ్నకు-

"నీకిది నిజంగా మొదటి అనుభవమేనా" మనసులో శూలం గుచ్చినట్లైంది, కళ్ళలో చివ్వున నీళ్ళు చిమ్మినై.

ఒక్కసారి అతన్ని ఒదిలించుకొని పక్కకు జరిగింది.

"ఏమిటి అలక?" విసుక్కున్నాడు మహేంద్ర.

"మీరు మాట్లాడే విషయాలు నాకు నచ్చలేదు. నిర్మలమైన మనసులతో ఒకటి కావలసిన రోజిది. అంతేగానీ కుళ్ళు మనసుతో మన సంసారాన్ని ఆరంభించడం నాకిష్టంలేదు...." రోషంగా, ఆవేదనగా అంది రేవతి.

"స్వచ్ఛంగా ఉండాలి కాబట్టే అడుగుతున్నాను. మధు ఎవరు?...."

"నా క్లాస్‌మేట్...."

"అతనిది, నీది ఏ రకమైన సంబంధం?"

"స్నేహం.... అంతే...."

"మీరిద్దరూ పెళ్ళి చేసుకోవాలనుకోలేదా?...." ఉలిక్కిపడింది రేవతి. అతనిది ఎటువంటి మనసో తేటతెల్లమవుతున్నది. ఇతనితోనా తను సాహచర్యం చెయ్యబోయేది. గుండెలు దడదడలాడుతున్నై.

"ఏం మాట్లాడవేం?" మళ్ళీ గద్దించాడు.

"నాకూ, అతనికి ఏ విధమైన సంబంధం లేదు."

"కానీ అతను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. ఇదంతా అబద్ధమా...."

"అతనికి ఆ అభిప్రాయం ఉండేది. కానీ నేనెప్పుడూ అతడిని ఆ దృష్టితో చూడలేదు- ఆ విషయం అతనితో ఏనాడో స్పష్టంగా చెప్పాను"

"ప్రతివ్రతలా కబుర్లు చెప్పకు– నీ చరిత్రంతా మొన్ననే సేకరించాను...."

ఈనిందకు రేవతి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై నోట్లోంచి మాటరాలేదు. కొంచెం సేపాగి మళ్ళా మహేంద్రే అన్నాడు. "పోన్లే ఇప్పుడదంతా ఎందుకు? కాసేపు సరదాగా మాట్లాడానంతే. ఏమిటంత సీరియస్‌గా అయినావ్–గావోయ్...." చెయ్యిపట్టి ఆమెను దగ్గరకు లాగాడు.

యాంత్రికంగా అతని చేష్టలకామె మైనం బొమ్మలా తిరిగింది. కానీ రేవతి మనసు మాత్రం అతని పట్ల విముఖతతో దూరం దూరం జరిగిపోతుంది.

మధుకూ, తనకూ కేవలం స్నేహమేనంటే నమ్మేసంస్కారం మహేంద్రకు లేదని స్పష్టమైపోయింది. అతని స్వభావం కూడా తెలిసిపోయింది.

పెళ్ళి లాటరీ–ఎటువంటి వాడితో ఎట్లా జీవితం గడపాలో అడుగుపెట్టే వరకూ తెలియదు. అనుకూలమైన జత దొరికిందా లాటరీలో లక్ష రూపాయల విజేతల మయినట్లు తద్వ్యతిరేకమైతే సర్వం కోల్పోయినట్లు.

శోభనం గదిలోకి అడుగు పెట్టక ముందే తానీ పెళ్ళి అనే లాటరీలో ఘోరంగా పరాజయం పొందినట్లు గుర్తించింది రేవతి. నిట్టూర్చడం మినహా అప్పుడు చేయగలిగిందేముంది? తీయగా కరిగి పోవాల్సిన రేయి బాధగా నిట్టూర్చింది,

X X X

ఉదయం లేచి స్నానంచేసి మహేంద్ర లేచేసరికి కాఫీ తీసుకుని గదిలోకి వచ్చింది రేవతి-రాత్రి అతనితో జరిగిన సంభాషణ అబద్ధమైతే బాగుండు ననిపిస్తున్నది.

కాఫీ అందుకుంటూ తనను చిలిపిగా కవ్విస్తాడేమోనని ఏమూలో ఉన్న ఆశ అతని ప్రశ్నకు ఆరిపోయింది.

"మధు ఉండేది ఈ ఊళ్ళోనే కదూ?"

కడుపులో దేవేసినట్లుంది అతని ప్రశ్న. 'అనుమానం రోగం-అది చావుతో కాని పోదు.'-అనుకుంది కసిగా.

"ఆ....ఇక్కడే - బ్యాంకులో పనేస్తాడు" అంది నిర్లిప్తంగా.

"ఫోన్ నంబరు తెలుసా?"

"ఆ...."

"సాయంత్రం మనింటికి భోజనానికి రమ్మని ఫోన్ చెయ్యి...." అన్నాడు కాఫి సిప్ చేస్తూ, రేవతి మొహంలో భావాలను గమనిస్తూ.

"ఇప్పుడు అతనెందుకూ?" మొహం చిట్లించింది రేవతి.

"నీ స్నేహితుడు కదా! నేనూ పరిచయం చేసుకుని స్నేహం పెంచుకుందామని...."

"అతనిప్పుడు మనింటికి రావడం నా కిష్టం లేదు...."

"నేను అతణ్ణి రమ్మని ఫోన్ చెయ్యమన్నాను. నువ్వు చెయ్యా ల్సిందే-విన్నావా ?" అధికారికంగా అన్నాడు మహేంద్ర.

"నా కిష్టంలేదు - నేను చెయ్యను" అక్కడ్నించి కదలబో యింది రేవతి.

"రేవతీ! మహేంద్ర అంటే ఏమనుకున్నావో-ఎప్పుడూ ఏ నిము షంకూడా నా మాటకు ఎదురు ఉండకూడదు-విన్నావా?" గర్జించాడు మహేంద్ర.

ఎంతో అపురూపంగా పెరిగిన రేవతి కళ్ళల్లో నీళ్ళు నిండినై. శ్లేష్మంలో పడ్డ ఈగ చందాన ఉంది పరిస్థితి. ఈ బంధాన్ని తెంచేసు కొని సాధ్యమైనంత దూరం సాధ్యమైనంత తొందరలో పారి పోవాలను కుంది. దాంపత్య జీవితంలో అడుగు పెట్టిన మరునటిరోజే ఈ విధంగా అనుకోవలసిరావడం ఎంత దౌర్భాగ్యం. అందమైన ఈ ముఖం తో దేలు కప్పుకున్న ముసుగులా ఉంది. చేష్టలుడిగి నుంచున్న రేవతి.

"బ్రష్ మీద పేస్టు వేసి-బాత్రూమ్‌లో వేడీనీళ్ళు పెట్టు" అని మళ్ళీ గర్జించాడు.

నిస్సత్తువగా బాత్రూమ్ వైపు నడిచింది రేవతి.

అతను మొహం కడుక్కొని స్నానం చేసి వచ్చాడు. యాంత్రి కంగా ఇడ్లీ ప్లేటు. మంచినీళ్ళు ముందుంచింది.

"నువ్వు తిన్నావా?" అన్నాడు.

లేదన్నట్లు తలూపింది రేవతి.

"నువ్వూ తెచ్చుకో."

"నాకు తినాలని లేదు" అంది.

"అయినా తినాల్సిందే" ఇంత అధికారం. ఇంతకు ముందు ఎప్పుడూ ఎరగని రేవతి అతని ప్రతిమాటకు ఉలిక్కిపడుతోంది. తప్పని సరిగా ప్లేటు తెచ్చుకొని కూర్చుంది. అదొక జైలులాగ తానొక ముద్దాయిలాగా, బందీగా—మహేంద్ర యముడిలా అనిపిస్తోందే కానీ కాపురానికి వచ్చిన రెండోరోజు భర్తతో పంచుకోవాల్సిన అనుభూతులేవీ మనసు ఛాయల్లోకి రావడం లేదు. చిన్న ఇడ్లీ ముక్కకూడ గొంతు దిగడంలేదు. మహేంద్ర మాత్రం గబగబా తినేశాడు.

"ఇవిగో ఎల్లుండి ఊటీకి వెళ్ళడానికి టికెట్స్ బుక్ చేశాను."

"మన ఆనందానికిప్పుడు ఊటీనే తక్కువైంది–" అనుకున్నది ఆక్కసుగా రేవతి.

రేవతి వంట చేసింది.

9-30 గంటలకు ఆఫీసుకు బయలుదేరేముందు "అన్నం వడ్డించమంటారా?" అన్నది. అసలు అతనితో మాట్లాడాలని ఏకోశానా లేదు,

"క్యారేజీలో పెట్టు" అన్నాడు.

అన్నం క్యారేజీలో పెట్టి తీసుకువచ్చి టేబుల్ మీద పెట్టింది.

ఫోన్ పక్కన కూర్చుని "మధు ఫోన్ నెంబరు ఏంత?" అన్నాడు మహేంద్ర. అతని ఉద్దేశం ఏమిటో అంతుపట్టడం లేదు.

మాట్లాడకుండా చిన్న స్లిప్ మీద నంబర్ వేసి అతనికిచ్చి వెళ్ళి పోతుంటే కూర్చోమన్నట్లు కుర్చీ చూపించాడు.

రేవతి కూర్చుంది.

ఫోన్ డయిల్ చేసి రింగవుతుంటే ఆమె చేతికిచ్చాడు. "మధుని పిలిచి, రాత్రికి మనింటికి భోజనానికి రమ్మను–". అన్నాడు.

ఫోన్ చేతిలోకి తీసుకుంది.

మధు లైన్లోకి వచ్చాడు.

"హలో! నేను రేవతిని మాట్లాడుతున్నాను!" అంది.

"ఓ రేవతి! బాగున్నారా? పెళ్ళికి రాలేకపోయాను సారీ! ఎట్లా ఉంది కొత్త జీవితం! మీవారెట్లాంటివారు?"

"ఆయన చాలా చాలా మంచివారు, చాలా విశాల హృదయులు. నువ్వు నాకు స్నేహితుడవని చెప్తే చాలా సంతోషించారు ఇద్దరం కలిసి అనుకున్నాం. ఈరోజు నిన్ను భోజనానికి పిలవాలని– ఆయన పక్కనే ఉన్నారు. నువ్వు 7 గంటలకు వస్తే బాగుంటుంది...." అన్నది.

"భోజనానికెందుకు– ఊరికే వస్తాను"

"కాదు కాదు నువ్వు అట్లాఅంటే మావారు చాలా బాధపడ్తారు...."

అంటుంటే మహేంద్ర పక్కనుంచి 'నేను మాట్లాడ్తాను'- అని సైగ చేశాడు. 'ఫోన్ మావారికిస్తున్నాను' అంటూ మహేంద్రకందించింది.

"హలో! మధుగారూ! నమస్కారమండీ! మాఆవిడ, మీరు చాలా క్లోజ్ ఫ్రెండ్సని తెలిసింది. ఆ... కాదు కాదు మీరు భోజనానికి రావల్సిందే...." అంటూ ఇంటి గుర్తులు చెప్పి ఫోన్ పెట్టేశాడు.

"క్యారేజీ తీసుకుని ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం రెండు గంటలకు ఫోన్ రింగయితే తీసింది రేవతి. మహేంద్ర చేశాడు "గంటసేపట్నుంచి ట్రై చేస్తుంటే ఎంగేజ్ వస్తుంది. మీ ఫ్రెండు మధుతో మాట్లాడ్తున్నావనుకున్నా...." అన్నాడు మహేంద్ర ఫోన్ తియ్యగానే.

అసలదేదో రాంగ్ నెంబరుకి పోయి ఉంటుంది. తనింతవరకూ ఎవరికీ ఫోన్ చెయ్యనూ లేదు, బయటి ఫోనూ రాలేదు.

అయినా కోపం కొద్దీ "అవును" అంది. అవతలనుంచి ఓ క్షణం మహేంద్ర మాట్లాడలేదు.

"నేను నాలుగుగంటలకే వచ్చేస్తాను. కూరలు కొనుక్కుని" అని ఫోన్ పెట్టేశాడు.

అతనిది ఎటువంటి సంస్కారమో అర్థం కావడంలేదు.

అసలు మధు ఎవరు? తనెవరు? అతని గురించిన వేరే రకమైన

ఆలోచనలు ఎప్పుడూ రాలేదు. అయినా కనిపించిన ప్రతి మగాడి గురించీ ఆలోచించడమే సా తన పని.

అమ్మా, నాన్న చూసిన సంబంధాలే–మహేంద్రను పెళ్ళిచూపుల్లో చూశాక నచ్చాడన్నది తను– అతని నుండి కూడా సమాచారం వచ్చింది. అంతకుముందు ప్రేమ వ్యవహారాలు తెలియకపోయినా మహేంద్రను చూసినప్పటి నుంచి తెలియకుండానే అతని చుట్టూ ఊహలు అల్లుకుంది. కలలు కన్నది, కానీ భార్యగా అతని ఇంట్లో అడుగుపెట్టిన క్షణమే ఆశలు నీరుకారిపోయినై. ఊహలన్నీ నిరుత్సాహ పడినై.

ఆలోచనల్లో పడి కొట్టుకుపోతూనే ఉంది రేవతి. అన్నం కూడా తినలేదు.

చెప్పినట్లుగానే 4 గంటలకు ఇంటికి వచ్చాడు మహేంద్ర. స్వీట్సు, కూరలు తీసుకుని.

మనసికంగా, శారీరకంగాకూడా అలిసిపోయిఉంది రేవతి, పైగా ఉందయం నుంచీ ఏమీ తినలేదు. మహేంద్రకు కాఫీ ఇచ్చి, బలవంతాన వంటకు ఉపక్రమించింది.

కూరలు తరుగుతుంటే అడిగాడు "నువ్వు మధు కలిసి ఎన్ని సినిమాలు చూశారు?" అని. తలెత్తి తీక్షణంగా చూసింది గానీ ఏం మాట్లాడలేదు. అతను ఏమనుకున్నాడో, ఊరుకున్నాడు. అంత అభిమానం గల తన్ను అతనంత అవమానిస్తుంటే ఎట్లా భరిస్తున్నదో'....

ఏదో వంట అయ్యిందనిపించింది.... అట్లాగే వెళ్ళి మంచంమీద పడుకుంది. టైమ్ ఆరున్నర అయినట్లుంది.

"రేవతీ!" పిలుస్తూ లోపలికి వచ్చాడు మహేంద్ర. పడుకుని ఉన్న రేవతిని చూసి "ఏమిటి పడుకున్నావు? లేచి మొహం కడుక్కో" అన్నాడు విసుగ్గా. అతనితో వాదన ఇష్టంలేదు - లేచి మొహం కడుక్కుని చీర మార్చుకుంది,

మనసు బిగుసులుగా ఉంది.

మీ ఫ్రెండు వస్తున్నందుకు సంతోషపడాలిగానీ అట్లా ఉన్నావేం భయపడుతున్నావా?...."

అతనేం మాట్లాడినా క్రూరంగా, కర్కశంగా ధ్వనిస్తోంది.

"తప్పు చేసినవాళ్ళు భయపడ్తారు....నాకెందుకండీ భయం-" అన్నది మెల్లగా. ఏడు గంటలవుతుండగా వచ్చాడు మధు. రేవతి నిర్లిప్తంగా ఉండిపోయింది.

"చాలాకాలానికి కలుసుకున్నారు కదా! అంత డల్‌గా ఉంటా వేంటోయ్. ముందు మంచి కాఫీ తీసుకురా...." పరిచయాలయ్యాక ఉత్సాహపర్తుస్తూ అన్నాడు మహేంద్ర...... అంతా నాటకంలో ఘట్టంలా ఉంది.

మధు నవ్వాడు. "రేవతి కాఫీ చాలా బాగా చేస్తుంది. రేవతి ఇవ్వకపోతే అడిగి కాఫీ పెట్టించుకుని తాగేవాణ్ణి."

రేవతి బలవంతంగా నవ్వింది.

మహేంద్ర కూడా నవ్వేడు— ఆ నవ్వులో ఏముందో గానీ కడుపులో దేవేసినట్లు వికారంగా అనిపించింది.

కాఫీ తీసుకువచ్చేలోపుగా మహేంద్ర మధును ఏవో ప్రశ్నలు వేస్తూనే ఉన్నాడు. అక్కడక్కడా వినబడుతున్నె. స్నేహ ధోరణిలో మధు చెప్తున్న జవాబులను మహేంద్ర ఏ విధంగా రిసీవ్ చేసుకుంటు న్నాడో ఊహిస్తే వణుకు పుడ్తోంది రేవతికి.

"ఓహో అయితే కాలేజీ డేకి ఇద్దరూ కలిసి ఫొటో దిగారన్న మాట...."

"ఆ, అది రేవతి ఆల్బమ్‌లో పెట్టుకుంది. రేవతీ! నీ ఆల్బమ్ చూపించలేదా....తీసుకురా సరదాగా చూద్దాం...." కాఫీ తీసుకువచ్చిన రేవతితో అన్నాడు మధు అతి మామూలుగా.

రేవతి గొంతు తడిఆరిపోయింది. నిష్కల్మషంగా మట్లాడుతున్న అతని మాటలను అర్థం చేసుకునే సంస్కారం మహేంద్రకు లేదని అతనికి తెలియదు.

"కాఫీ తీసుకోండి". అంది ట్రే అక్కడ పెడ్తూ. ఆ సంభాషణ ముగిసి అతను వెళ్ళిపోతే బాగుండునని ఉంది రేవతికి.

కానీ మధు మళ్ళీ అన్నాడు "ఆల్బమ్ తీసుకురా" అని. "అది ఇక్కడకు తేలేదు!" అంది మెల్లగా.

"పుట్టింట్లో రహస్య స్థావరాల్లో చాలా ఉండి ఉంటాయి-మధూ, మీ కిష్టమైన మీ ఫ్రెండు చేసిన కాఫీ తీసుకోండి...." అన్నాడు వత్తి పలుకుతూ. నుంచునే ఉన్న రేవతిని మధు కూర్చోమని బలవంతం చేశాడు. 8 గంటలు దాటేవరకు ఎట్లాగో టైమ్ గడిచింది. ఆఁ, ఊఁ అనడం తప్పించి రేవతి సంభాషణలో ఎక్కువగా పాల్గొనలేదు.

"ఏమిటి రేవతీ! అట్లా ఉన్నావేం?" అన్నాడు మధు ఆమె అన్యమనస్కత గురించి.

"ఏమీలేదు. మీరిక లేవండి. భోజనం వడ్డిస్తాను, చల్లారిపోతోంది" అంది లేస్తూ రేవతి.

"కాళ్ళు కడుక్కొగండి- అదిగో బాత్రూమ్"- అని మహేంద్ర లేచి బాత్రూమ్ చూపించాడు.

డైనింగ్ టేబుల్ మీద ప్లేట్లు సర్దుతున్న రేవతి 'అమ్మా' అన్న ఆర్తనాదానికి ఉలిక్కిపడి బాత్రూమ్ దగ్గరకు పరిగెత్తింది.

తలపగిలి రక్తం మడుగులో పడివున్న మధు, కాలయముడిలా చేతిలో ఇనుపరాడ్ తో క్రూరంగా నవ్వుతున్న మహేంద్ర.

"నీ ప్రియుణ్ణి చంపేశానే. ఇక జీవితంలో మనమధ్య ఎవ్వరి అడ్డూ లేదు...." అంటున్నాడు ఎర్రబారిన నేత్రాలతో రౌద్రంగా.

పైశాచికంగా, అనుమాన రాక్షసికి మారుపేరులా చిత్రమైన మనస్తత్వంగల మహేంద్ర నొక క్షణం కొయ్యబారిపోయి చూసింది. రేవతి. మరుక్షణం చేతిలో ప్లేటు జారవిడిచి కాలి సత్తువకొద్దీ బాణంలా గేటు బయటికి, పోలీస్ స్టేషన్ దిశగా దూసుకుపోయింది.

(యువ మాస పత్రిక, ఆగస్టు 1985)